క్లుప్తంగా

తిరుమలనాథ స్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథ స్వామి

పెద్దారవీడు: మండల పరిధిలో రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన పుణ్యక్షేత్రం శ్రీ గొ్డ్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు శనివారం చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు ఆలయం ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉత్తమ విద్యార్థులకు లాప్‌టాప్‌ల పంపిణీ

ముండ్లమూరు: ఇంటర్మీడియెట్, ఎంసెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం వారి ఆధ్వర్యంలో సోమవారం లాప్‌టాప్‌లు పంపిణీ చేయనున్నారు. మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ, శశికాంత్ వల్లేపల్లి, ఫౌండేషన్ చైర్మన్ జిల్లెలమూడి వెంకట్ చేతులు మీదుగా అందిస్తామని ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ కె. పూర్ణచంద్రరావు ఆదివారం తెలిపారు. ముండ్లమూరు, అద్దంకి మండలాలకు విద్యార్థులు ఇంటర్, ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించి ఇంజినీరింగ్‌లో జాయిన్ కాబోతున్న పేద, మెరిట్ విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో సోమవారం ఉదయం 11 గంటలకు హాజరు కావాలన్నారు.

నూతన పీరు ఏర్పాటు



ఊరేగింపుగా నూతన పీరు

కురిచేడు (దొనకొండ): కురిచేడు పోలీస్ స్టేషన్ సెంటర్‌లోని అన్ని కులాల వారు లక్ష రూపాయలు విరాళాలు వసూలు చేసి నూతన పీరు సుందరంగా ఏర్పాటు చేశారు. అంతా కలిసిమెలిసి ఐక్యతతో ఆదివారం రాత్రి భారీగా ఊరేగింపు చేసుకుంటూ నూతన పీరును పీర్ల చావిడిలోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. అన్నదానం రాత్రికి ఏర్పాటుకు సంసిద్ధం చేస్తున్నారు.

నిరసన విరమించిన కార్మికులు



కొమరోలులో చెత్త సేకరిస్తున్న కార్మికులు

కొమరోలు: గత ఐదు రోజులుగా జీతభత్యాలు చెల్లించలేదంటూ నిరసన కార్యక్రమం చేపట్టిన పారిశుద్ధ్య కార్మికులు ఆదివారం విరమించారు. కొమరోలులో సచివాలయంలో 30 నెలలుగా తమకు జీతాలు చెల్లించలేదంటూ సచివాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాగా 5 నెలల జీతాలు చెల్లించడంతో విరమించారు. త్వరలోనే మిగిలిన జీతాలను చెల్లిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారని తెలిపారు.

శాకంబరిగా కోట సత్యమాంబదేవి



బేస్తవారిపేట: శాకంబరిదేవిగా కోటసత్యమాంబదేవి



బేస్తవారిపేట: శాకంబరుడిగా సత్యమణికంఠేశ్వరుడు



మార్కాపురం : భక్తులకు దర్శనమిస్తున్న ముద్దసానమ్మ అమ్మవారు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా వర్షాలు పడి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని కోట సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని శాకాంబరిదేవిగా, సత్యమణికంఠేశ్వర స్వామిని శాకాంబరుడిగా ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివార్లకు అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు కుంకుమ బండ్లతో సత్యమాంబదేవి ఆలయం వద్దకు తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ముద్దసానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లి గ్రామంలో వెలసిన ముద్దసానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. ఆదివారం ముద్దసానమ్మకు మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొని తమ కష్టాలు తీర్చాలని అమ్మవారిని వేడుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, పరిసర ప్రాంత ప్రజల గ్రామ ఇలవేల్పు అయిన అల్లూరి పోలేరమ్మ తల్లిని ఆదివారం సందర్భంగా భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. పోలేరమ్మను ప్రత్యేకంగా అలంకరించి అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ బండ్లతో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య శిలలు, పుట్టలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.



మార్కాపురం : ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ అమ్మవారు



విగ్రహానికి రంగులు వేస్తున్న కార్మికులు

వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించాలి

యర్రగొండపాలెం: సంక్షేమ సారథి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఈ నెల 8వ తేదీన వైఎస్సార్ జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు జయంతోత్సవాల సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని, గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకం చేయాలని కోరారు.

పెద్దదోర్నాల: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో జరిగే వేడుకలకు నటరాజ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఈ సందర్భంగా విగ్రహానికి బంగారు రంగుతో పాటు రెయిలింగ్‌ను మూడు రంగులతో తీర్చిదిద్దుతున్నారు. మండల బూత్ కమిటీ కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి తన సొంత ఖర్చులతో విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి పిలుపు నిచ్చారు.

దర్శి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి పురస్కరించుకుని వైఎస్సార్ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరవుతారన్నారు. గడియారం స్తంభం సెంటర్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని తెలిపారు. అనంతరం వైఎస్సార్ సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తామని చెప్పారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలో ఏర్పాటు చేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి విజయవంతం చేయాలని మండల మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు తరలి వచ్చి జయంతి వేడుకలను విజయవంతం కోరారు.

మార్కాపురం టౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని సోమవారం మార్కాపురం నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని కోరారు. మార్కాపురం పట్టణంలోని పాతబస్టాండు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు నేటి ఉదయం 9.30 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని, వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు అన్నా రాంబాబు తెలిపారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం దివంగతనేత వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. గిద్దలూరు నియోజకవర్గం ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించాలన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ అభిమానులు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



పిక్కిలి చిన్నపుల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్సై మధుసూదన్‌రావు

కొమరోలు: తీవ్రవాదుల దాడిలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన పిక్కిలి చిన్నపుల్లయ్యకు స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు ఘననివాళి అర్పించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పిక్కిలి చిన్నపుల్లయ్య 1998లో జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో వీరోచితంగా పోరాడి జూలై 7వ తేదీన వీరమరణం పొందాడు. కాగా ఢిల్లీ సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఆదేశాల మేరకు కొమరోలు ఎస్సై మధుసూదన్‌రావు, సర్పంచ్ వెంకటేశ్వర్లు నాగిరెడ్డిపల్లె గ్రామంలోని పిక్కిలి చిన్నపుల్లయ్య నివాసానికి వెళ్ళి చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆర్థిక సాయం అందించిన డాక్టర్ రమేష్



నగదు అందిస్తున్న డాక్టర్ రమేష్

బేస్తవారిపేట: హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.65 వేలతో డెడ్ బాడీ ఫ్రీజర్‌ను సమకూర్చనున్నారు. దీనికిగాను గలిజేరుగుళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ రూ.5 వేలను విరాళంగా సంస్థ అధ్యక్షుడు రాయుడుకి అందించారు. బేస్తవారిపేట, కంభం, అర్ధవీడు మండలాల్లోని వారికి అందుబాటులో ఉండే విధంగా డెడ్ బాడీ ఫ్రీజర్‌ను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

గురువులను గౌరవించాలి

గిద్దలూరు రూరల్: గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ జిల్లా సంపర్క ప్రముఖ్ కె.రామక్రిష్ణ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీరామక్రిష్ణ ధ్యాన మందిరంలో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కృషి చేస్తుందన్నారు. ఆదర్శవంతమైన జీవితం గడిపేందుకు గురువు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లారెడ్డి, బాలక్రిష్టారెడ్డి, బూజుమేకల రాజు, ఆసూలాల్, పాల్గొన్నారు.

సవరణ

తేది: 07-07-2024 సాక్షి మార్కాపురం డివిజన్ నందు ప్రచురించబడిన ది కంభం కో - ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్, కంభం " స్థిరాస్తుల అమ్మకం బహిరంగ ప్రకటన"లో బహిరంగ వేలం తేదీ పొరపాటున 07-07-2024గా ప్రచురితమైనది. పాఠకులు దీనిని 07-08-2024 తేదిగా గమనించగలరని మనవి.

సం/- మేనేజరు

భక్తుల కోర్కెలు తీర్చే దైవం సాయిబాబా



సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న నిర్వాహకులు

మార్కాపురం: నమ్ముకున్న భక్తుల కోరిన కోర్కెలు తీర్చే ప్రత్యక్ష దైవం షిరిడీసాయి బాబా అని గుంటూరు ఆర్అండ్‌బీ ఈఈ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం అన్నారు. మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు చేస్తున్న ప్రవచనాల్లో ఆదివారం మూడో రోజు ఆయన మాట్లాడుతూ బాబా అతి నిరాడంబర జీవితం గడిపారని అన్నారు. బాబా భిక్షాటన చేసి వచ్చిన ఆహారంతో తాను, వచ్చిన భక్తులు, జంతువులు, పక్షులకు అందించేవారని తెలిపారు. భక్తుల బాధలను తన బాధలుగా తీసుకొని బాబా వారిని ఆదరించారని అన్నారు మందిరం అధ్యక్ష, కోశాధికారులు గోపాలుని హరిహరరావు, కార్యదర్శులు పేరం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రామడుగు గోపి, కోశాధికారి నాగరాజు, అదనపు కార్యదర్శి పవన్, గోపిశెట్టి కొండయ్య, కమిటీ సభ్యులు సూరె నాగేశ్వరరావు, విజయ్, కృష్ణమోహన్, రమణారెడ్డి, మధు, వెంకటేశ్వరరెడ్డి, కరీమ్, మోహన్, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు, దోమతెరలు అందజేత



దోమతెరలు, సీలింగ్ ఫ్యాన్ అందిస్తున్న ఎస్‌టీయూ నాయకులు

తర్లుపాడు: స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ విద్యార్థులకు దోమతెరలు, సీలింగ్ ఫ్యాన్లు ఎస్‌టీయూ ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుధాకర్‌కు అందజేశారు. నీటి ట్యాంకు రిపేరుకు రూ.5 వేల నగదు అందించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ మండల అధ్యక్షులు కశ్శెట్టి జగన్‌బాబు, షేక్ నజీర్ అహ్మద్, అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్ వాడకం తప్పనిసరి



కొనకనమిట్లలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

కొనకనమిట్ల: ప్రతి వాహనదారుడు, టూ వీలర్స్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ వాడి తమ జీవితానికి భద్రత కల్పించుకోవాలని ఎస్ఐ కె.మాధవరావు వాహనదారులకు సూచించారు. ఆదివారం సాయంత్రం కొనకనమిట్ల సమీపంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించి పత్రాలను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా నడిపే వాహనాలకు చలానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి



ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

యర్రగొండపాలెం: మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖలు ఆయా రంగాలలో అభివృద్ధి సాధించాలని సంపూర్ణత అభియాన్ పరిశీలకుడు ప్రదీప్ అన్నారు. శనివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూర్తిగా వెనక బడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, అన్ని శాఖలకు చెందిన అధికారులు మండలాన్ని అభివృద్ధి దిశలో నడపాలని కోరారు. ముందుగా మండల రెవెన్యూ కార్యాలయం నుంచి అధికారులు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు ప్రతిభను చాటారు. ఆరోగ్య, ఐసీడీఎస్, వ్యవసాయం, గిరిజన, డీఆర్‌డీఏ శాఖల స్టాళ్లను ప్రదర్శనకు ఉంచారు. సీఈవో మాధురి, డీఎంహెచ్‌వో సురేష్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, జేడీఏ ఎస్.శ్రీనివాసరావు, డీపీఎం సుభాషిణి, డీఎల్‌డీవో సాయికుమార్, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, ఈవోపీఆర్డీ రాజశేఖరరెడ్డి, సీడీపీవో పద్మావతి, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఏవోలు శేషారెడ్డి, సుచరిత్ర, సుమతి పాల్గొన్నారు.

మండల కన్వీనర్‌కు పితృ వియోగం



చిన్న నాగయ్యకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కురిచేడు(దొనకొండ): కురిచేడు మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ యన్నాబత్తిన వెంకట సుబ్బయ్య తండ్రి చిన్న నాగయ్య (72) ఆదివారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మండల జెడ్పీటీసీ నుసుం వెంకటరెడ్డి మరికొంత మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు గంగదొనకొండకు వెళ్ళి ఆయన భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారిలో ఏ. చంద్రారెడ్డి, భాస్కరరెడ్డి, కండె గంగయ్య యాదవ్, కర్నాటి వెంకటరెడ్డి, అందె సుబ్బారెడ్డి, టౌన్ అధ్యక్షులు గుంటక నాసరరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

